సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 10 । మే । 2024



ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

నందిపేట మండలం తల్వేద ఎత్తిపోతల పథకం మొదటి పంప్‌హౌజ్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది.

- 2లో ▸



ప్రధాన పార్టీల ‘గల్ఫ్’ జపం

పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములను గల్ఫ్ కార్మికుల కుటుంబాల ఓట్లు ప్రభావితం చేయనున్నాయి.

- 2లో ▸

గరిష్టం/కనిష్టం
41.1 /27.5

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లాలో చల్లబడ్డ వాతావరణం

- ఉక్కపోత, ఎండ వేడిమి నుంచి ఉపశమనం

సుభాష్‌నగర్: జిల్లాలో ఎండ వేడిమి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఉపశమనం లభించింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. క్యూములో నింబస్ వల్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల వరకు నమోదు కాగా, సాయంత్రం సమయంలో జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురిశాయి. గాలులకు ఒకటిరెండు చోట్ల చెట్లు నేలకొరిగాయి. అలాగే రానున్న రోజుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగులుపడే అవకాశముంది. అక్కడక్కడ చిరుజల్లులు కూడా కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు. మే 13 లేదా 14న వర్షం కూడా కురుసే అవకాశముందని ప్రకటించారు. మరో 15 రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి.

రేపు సాయంత్రం నుంచి ప్రచారంపై నిషేధం

- వైన్ షాపులు బంద్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమల్లోకి వస్తుందని రిటర్నింగ్ అధికారి, రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ సమయం ఉంటుందన్నారు. జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ జిల్లాలో ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ, పోలీస్ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అన్ని కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జిలలో తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఎన్నికలు ముగిసే వరకు జిల్లాలో మద్యం షాపులను మూసివేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో ఉషా ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు. కాగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమీపించిన తరుణంలో సమావేశానికి కోరం హాజరవుతారా లేదా అనే సందిగ్ధం నెలకొంది. అంతేకాకుండా జిల్లాలోని ముఖ్య అధికారులు, వివిధ శాఖల అధికారులు కూడా ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నారు.

13న వేతనంతో కూడిన సెలవు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈనెల 13న ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవును ప్రకటించిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, పరిశ్రమలకు సెలవు ఉంటుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో జోష్

- నిజామాబాద్ ఎంపీ నియోజకవర్గంలో సీఎం రేవంత్ మూడోసారి ప్రచారం
- రెండు వారాల్లో మూడుసార్లు ముఖ్యమంత్రి పర్యటన
- నిజాంషుగర్స్ సెప్టెంబర్‌లో తెరిపిస్తామనే హామీతో కాంగ్రెస్ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం
- గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కార్యకర్తల్లో హర్షం
- జీవన్‌రెడ్డి సీనియారిటీ మరింత కలిసొస్తుందంటున్న నాయకులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల ప్రచార కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించడం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. రెండు వారాల్లో ముఖ్యమంత్రి జిల్లాలో రెండుసార్లు ప్రచార సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. మొత్తంగా నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో మూడు సార్లు ప్రచారంలో పాల్గొని శ్రేణుల్లో జోష్ నింపారు. నిజామాబాద్‌లో బహిరంగసభ, రోడ్‌షో, కార్నర్ మీటింగ్, ఆర్మూర్‌లో రోడ్‌షో, కోరుట్లలో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. సభలు, రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు విజయవంతం కావడంతో నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. మాస్ లీడర్‌గా, క్రౌడ్ పుల్లర్‌గా పేరున్న రేవంత్ ప్రచారానికి రావడంతో పాటు పలు అంశాలపై హామీలు ఇవ్వడంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిజాంషుగర్స్, గల్ఫ్ బోర్డుపై సీఎం హామీతో ఉత్సాహం

పసుపు బోర్డు విషయమై గత ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలుపొందిన సిట్టింగ్ ఎంపీ అర్వింద్ ఇప్పటికీ ఏర్పాటు చేయించలేదని, పసుపు బోర్డు కాగితాల్లోనే ఉందని, ఇప్పటికీ బోర్డు పేరిట రైతులను మభ్యపెడుతున్నారంటూ రేవంత్ విమర్శలు చేశారు. మరోవైపు వచ్చే సెప్టెంబర్ 17వ తేదీలోగా నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపించనున్నట్లు, ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని, ప్రక్రియ తుదిదశకు చేరుకుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. అదేవిధంగా గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సంబంధించి ఏర్పాటుకు రంగం సిద్ధం చేసినట్లు సీఎం పేర్కొన్నారు. మరోవైపు 60 గల్ఫ్ సంక్షేమ సంఘాల జేఏసీకి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గల్ఫ్‌లో మరణించిన కార్మికులకు రూ. 5లక్షల చొప్పున పరిహారం ఇచ్చే ప్రక్రియ ప్రారంభించారు. ఈ అంశం సైతం తమకు మేలు చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆశాభావంతో ఉన్నారు.

రైతు రుణమాఫీ, రైతుభరోసా..

వచ్చే ఆగస్టు 15లోగా రైతులకు రూ. 2లక్షల మేర రుణమాఫీ చేసి తీరతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో రైతులు తమవైపే మొగ్గుచూపుతారని కాంగ్రెస్ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక తాజాగా 69 మంది రైతులకు రైతు భరోసా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇది మరింత మేలు చేయనుందని కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అభివృద్ధి విషయమై..

జిల్లాను అభివృద్ధి చేసే విషయంలో తానే బాధ్యత తీసుకుంటానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై శ్రేణులు ఉత్సాహంతో ఉరకలెత్తుతున్నాయి. తాను ఆర్మూర్‌లో రైతు దీక్ష చేశాక పీసీసీ అధ్యక్షుడయ్యానని, తర్వాత ఈ జిల్లా ప్రజలు, రైతుల ప్రోత్సాహంతో ముఖ్యమంత్రిగా మీ ముందుకు వచ్చి నిలబడ్డానని చెప్పిన రేవంత్ వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో జిల్లాను అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తానని, ఎంపీగా తాటిపర్తి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. విలువలు, నిబద్ధత కలిగిన జీవన్‌రెడ్డి సుదీర్ఘ అనుభవం సైతం జిల్లాకు మేలు చేస్తుందని ముఖ్యమంత్రి చెప్పడం గమనార్హం. జీవన్‌రెడ్డిని గెలిపిస్తే నిజామాబాద్‌కు స్మార్ట్ సిటీ మంజూరు చేయించడంతో పాటు జిల్లాలో ప్రభుత్వం ఇంజినీరింగ్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు ఆర్మూర్ మున్సిపల్ భవనానికి రూ.16 కోట్లు మంజూరు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ అంశాలన్నీ తమ గెలుపుకు దోహదపడతాయని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో దూసుకెళ్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జనరల్ అబ్జర్వర్ ఎలిస్ వజ్ ఆర్



నూత్‌పల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జనరల్ అబ్జర్వర్

డొంకేశ్వర్(ఆర్మూర్): పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా మూడు రోజులే ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో వీలైనంత త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ఎలిస్ వజ్ ఆర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో గల ఓటరు కేంద్రాన్ని పరిశీలించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి ఉన్నతాధికారులకు వివరాలను చేరవేయాలని తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే సమాచారం అందించాలన్నారు. బీఎల్వోలు స్థానికంగా ఉండి తెలియని ఓటర్లకు సహాయం అందించాలని సూచించారు. ఇందులో తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ రాజేశ్వర్, సర్వేయర్ కిషన్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గాదేపల్లి, దత్తాపూర్, మారంపల్లి పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో శ్రీనివాస్ రావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎలక్ట్రిసిటీ పనులు పూర్తి చేయాలని సూచించారు.

జీవన్‌రెడ్డి మాల్ సీజ్‌కు ఆర్టీసీ నోటీసులు

- హైకోర్టు ఉత్తర్వుల మేరకు మేనేజర్‌కు పత్రాలను అందించిన అధికారులు
- టీఎస్ ఆర్టీసీకి అద్దె బకాయి రూ. 3.14 కోట్లు
- బకాయిలు చెక్ రూపంలో చెల్లించామని పేర్కొన్న మాల్ మేనేజర్



ఆర్మూర్: ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి పేరిట పట్టణంలో ఉన్న జీవన్‌రెడ్డి మాల్ నుంచి ఆర్టీసీకి బకాయి ఉన్న రూ. 3.14 కోట్లను చెల్లించాలని ఆర్టీసీ అధికారులు నోటీసులిచ్చారు. కరీంనగర్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ బాబురావు, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం శంకర్ నాయక్, నిజామాబాద్ ఒకటో డిపో, ఆర్మూర్ డిపో మేనేజర్లు ఆనంద్, ఆంజనేయులు పోలీసు బలగాలతో గురువారం జీవన్‌రెడ్డి మాల్‌కు వచ్చి నోటీసులు జారీచేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు నెల రోజుల సమయం ఇస్తూ మాల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినా చెల్లింపులు చేయని కారణంగా సాయంత్రం వరకు చూసి మాల్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ‘మాల్‌లో అద్దెకు ఉన్న దుకాణాదారులకు మాల్‌ను సీజ్ చేస్తున్నాం. కాబట్టి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి’ అని సూచిస్తూ మైక్‌లో ప్రకటించారు. కాగా మాల్ మేనేజర్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతూ తాము బకాయిలు చెల్లిస్తూ చెక్‌ను వేశామని పేర్కొన్నారు. చెక్ ద్వారా చెల్లింపు జరిగిందా లేదా పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు.

బకాయిల వసూలు కోసం..

రాష్ట్రంలో అధికార మార్పు జరగగానే ఆర్టీసీ, ట్రాన్స్‌కో అధికారులు బకాయిల వసూలుకు నడుం బిగించారు. గతేడాది డిసెంబర్ 7న ఆర్టీసీ సిబ్బంది, ట్రాన్స్‌కో అధికారులు మొదటిసారిగా మాల్ బకాయిలను వసూలు చేయడానికి పూనుకున్నారు. దీంతో కోర్టును ఆశ్రయించిన నిర్వాహకులు విడతల వారీగా ట్రాన్స్‌కో బకాయిలు, ఆర్టీసీ బకాయిలు చెల్లిస్తూ వస్తున్నారు. తాజాగా ఆర్టీసీకి మిగిలిన రూ. 3.14 కోట్ల బకాయిలను సైతం రాబట్టుకోవడానికి ఆర్టీసీ అధికారులు పూనుకోవడం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చర్చనీయాంశంగా మారింది. కాగా.. ఆర్టీసీ ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు మాల్‌ను గురువారం సాయంత్రం సీజ్ చేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. చెక్ రూపంలో మాల్ యజమానులు చెల్లించిన బకాయిలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు.



జీవన్‌రెడ్డి మాల్‌ను సీజ్ చేస్తామని మైక్‌లో అనౌన్స్ చేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం, పోలీసు అధికారులు

దేశానికి మోదీ.. ఇందూరుకు అర్వింద్ అవసరం..

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రధాని అభ్యర్థులు ఎవరు..?
- 2019లో కవిత ఇక్కడ ఎంపీగా పోటీ.. ఇప్పుడు జైల్లో..
- తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ తమిళిసై, పక్కన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: దేశం అభివృద్ధి చెందడంతో పాటు సుభిక్షంగా ఉండాలంటే ప్రధానిగా మోదీ, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే.. సుభిక్షంగా ఉండాలంటే ఎంపీగా అర్వింద్ ధర్మపురి కావాలని తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. గురువారం రాత్రి నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తాలో బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి తరఫున ఎన్నికల ప్రచారంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటేస్తే ఎవరు ప్రధాని అవుతారని ప్రశ్నించారు. బీజేపీకి ఓటేస్తే ప్రపంచ నాయకుడు, బలమైన వ్యక్తి నరేంద్ర మోదీ ప్రధాని అవుతారన్నారు. దేశానికి బలమైన ప్రధాని కావాలంటే కమలం గుర్తుకు ఓటేయ్యాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో పేదరికం నిర్మూలన బీజేపీతోనే సాధ్యమన్నారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితపై పోటీచేసి అర్వింద్ విజయం సాధించారని తెలిపారు. కవిత ఇక్కడ ఎంపీగా పోటీచేసి.. ఇప్పుడు జైల్లో ఉందని ఎద్దేవా చేశారు. ధర్మపురి అర్వింద్ రైతు పక్షపాతి అని, పసుపు రైతుల కోసం పసుపు బోర్డు, స్పైస్‌బోర్డు రీజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించారన్నారు. అదేవిధంగా అర్వింద్ ఫౌండేషన్ ద్వారా చిన్నారుల ప్రాణాలను కాపాడారని గుర్తుచేశారు. మోదీకి తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు.

ధర్మం, అధర్మం మధ్య జరిగే ఎన్నికలు..

దేశంలో జరుగుతున్న ఎన్నికలు ధర్మం, అధర్మానికి, నీతి, అవినీతికి మధ్య జరిగేవని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. కేవలం ముస్లింల కోసమే కాంగ్రెస్ పని చేస్తుందని, హిందువులంటే వారికి చులకన అని ఆరోపించారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ అని, రాజ్యాంగాన్ని వందసార్లు సవరించిన చరిత్ర ఆ పార్టీదన్నారు. ఓటుకు నోటు దొంగ రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. జిల్లాలో లవ్ జిహాద్ పేరుతో మన హిందూ యువతులను ట్రాప్ చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు తోడు దొంగలే, కాళేశ్వరం అవినీతిపై, ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. అనంతరం బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, నాగోల్ల లక్ష్మీనారాయణ, స్రవంతిరెడ్డి, పంచరెడ్డి ప్రవళిక, శంకర్, బంటు వైష్ణవి రాం, ఆకుల శ్రీనివాస్, సుక్క మధు, రోషన్, గడ్డం రాజు, పుట్ట వీరేందర్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి హుందాగా వ్యవహరించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం నిజామాబాద్‌కు వచ్చి హిందువులను బిచ్చగాళ్లు అంటున్నారని.. హుందాగా వ్యవహరించాలని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి హితవుపలికారు. దేవుడి పేరుతో బీజేపీ బిచ్చగాళ్లలా ఓట్లు అడుక్కుంటున్నారని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ఓట్లు అడుగుతున్నారని, మహిళలు, యువకులు, రైతులను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఉగ్రవాద సంస్థలైన సిమి, పీఎఫ్ఐ బహిరంగంగా మద్దతు ప్రకటిస్తే.. తోసిపుచ్చకుండా సంతోషంగా స్వీకరించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్‌ది సిగ్గుమాలిన నాయకత్వమని విమర్శించారు. రోహింగ్యాలకు పౌరసత్వం ఇస్తే దేశంలో నిత్యం బాంబు బ్లాస్టులు, మత కల్లోలాలు సృష్టిస్తారని.. ఉగ్రవాద సంస్థలు మద్దతిస్తున్న కాంగ్రెస్‌ను ఓడించాలని కోరారు. బీజేపీకి 400 సీట్లు ఇవ్వకుంటే అయోధ్యలో రామమందిరానికి బాబ్రీ తాళం వేస్తారని మోదీ ఇటీవల ప్రకటించారని గుర్తుచేశారు. నిజామాబాద్ పార్లమెంట్‌లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, రెండోసారి గెలిపిస్తే స్మార్ట్‌సిటీగా చేస్తానని, హిందువుల ఓటింగ్ శాతం పెరిగేలా మనతోపాటు మనవాళ్లందరితో ఓట్లు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

ఊరొక చోట.. ఓటింగ్ మరో చోట..

- చిన్నయానం గ్రామానికి పోలింగ్ స్టేషన్ కరువు
- ఓటు వెయ్యాలంటే పక్క ఊరికి వెళ్లాల్సిందే
- ఎన్నికలు వచ్చిన ప్రతీసారి ఇదే పరిస్థితి



చిన్నయానం గ్రామస్తులు

డొంకేశ్వర్(ఆర్మూర్): చిన్నయానం.. డొంకేశ్వర్ మండలంలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌కు ఆనుకుని ఉన్న ఇదొక మారుమూల గ్రామం. ఊర్లో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పంచాయతీ కార్యాలయం కూడా ఉంది. కానీ, ఓటు వేయడానికి స్థానికంగా ఓటరు కేంద్రం మాత్రం లేదు. గ్రామస్తులు ఓటు వేయాలంటే పక్కన రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గాదేపల్లికి వెళ్లాల్సి వస్తోంది. వ్యయప్రయాసలకోర్చి ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లి ఓటును వేస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుంది. కొన్నేళ్లుగా ఓటర్లు ఇబ్బందులు పడుతున్నా చిన్నయానంలో పోలింగ్ కేంద్రం ఇంత వరకు ఏర్పాటు కాలేదు. గ్రామంలో పోలింగ్ కేంద్రం అవసరమని రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు పంపినా ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. చిన్నయానం ఆరేళ్ల క్రితం గాదేపల్లి జీపీలోనే కలిసి ఉండేది. గాదేపల్లి–చిన్నయానంకు మధ్య రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. జనాభా, ఓటర్లు ఎక్కువగా ఉండడంతో 2018లో గాదేపల్లి నుంచి విడిపోయి కొత్త పంచాయతీగా ఏర్పడింది. కాని పోలింగ్ కేంద్రం వేరు కాలేదు. ఇప్పటికీ గాదేపల్లిలో 112 పోలింగ్ కేంద్రానికి వచ్చి చిన్నయానం గ్రామస్తులు ఓటు వేస్తున్నారు. అయితే, ఓటరు కేంద్రం దూరంగా వేరే ఊరిలో ఉండడంతో కొంతమంది ఓటు వేసేందుకు వెనుకాడుతున్నారు. దీంతో చిన్నయానం నుంచి పోలింగ్‌శాతం పెద్దగా నమోదవడం లేదు. అయితే, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని చిన్నయానంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నాలుగు నెలల క్రితం కలెక్టర్ అనుమతితో ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించామని తహసీల్దార్ వెంకటరమణ ‘సాక్షి’కి వివరణ ఇచ్చారు.

విలేజ్ ప్రొఫైల్..

కుటుంబాలు	152
జనాభా	585
ఓటర్లు	364

గ్రామానికి లోటు



పోలింగ్ కేంద్రం లేకపోవడం గ్రామానికి లోటుగా ఉంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఓటర్లు రెండు కిలోమీటర్లు ప్రయాణించి పక్క ఊర్లో ఓటు వేయాల్సి వస్తోంది. రెండు గ్రామాలకు ఒకే పోలింగ్ కేంద్రం ఉండడంతో ఓటు వేయడం ఆలస్యం అవుతోంది.

– ఎర్రం సుష్మిత, మాజీ సర్పంచ్, చిన్నయానం

అధికారులు స్పందించాలి



గ్రామ పంచాయతీగా ఏర్పడినా మాకు తిప్పలు తప్పడం లేదు. గ్రామానికి ఇప్పటి వరకు పోలింగ్ కేంద్రం లేకపోవడం ఇబ్బందిగా ఉంది. ఊరు ఒకచోట, పోలింగ్ కేంద్రం మరొక చోట పెట్టడం సరికాదు. అధికారులు స్పందించి చిన్నయానంలో ఓటరు కేంద్రం ఏర్పాటు చేయాలి.

– పెద్దగౌండ మోహన్, చిన్నయానం

ఎన్నికల్లో ప్రలోభాల నివారణకు పటిష్ట నిఘా

- ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో అబ్జర్వర్లు
- రెట్టింపు సంఖ్యలో నిఘా బృందాల ఏర్పాటు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ ఎలిస్ వజ్ ఆర్, పక్కన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సమయం సమీపించిన నేపథ్యంలో ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి ప్రలోభాలకు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు, ఇంటెలిజెన్స్ బృందాలు గట్టి నిఘా కొనసాగిస్తూ అంకితభావంతో పనిచేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకులు డీఎం నెప్మీ సూచించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో జరిగిన ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, ఇతర తాయిలాలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, వీడియో వింగ్ బృందాలు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీలను నిశితంగా పరిశీలించాలని, అధిక మొత్తంలో నగదు బదిలీ జరిగే ఖాతాలను గుర్తించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావును ఆదేశించారు. అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వహించాలని, ఐఎంఎల్ డిపో నుంచి దిగుమతి చేసుకుంటున్న మద్యం నిల్వలు పక్కదారిపై నిఘా ఉంచాలని ఎక్సైజ్ అధికారులకు తెలిపారు. పోలింగ్‌కు సమయం సమీపించినందున మరింత అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని నిఘా బృందాల అధికారులకు సూచించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ఆబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బందితో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని వివరించారు. తనిఖీలను మరింత ముమ్మరం చేయిస్తామని పరిశీలకులకు తెలిపారు. అలాగే ప్రస్తుతం పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో 21 ఎఫ్ఎస్‌టీ బృందాలు నిఘా కొనసాగిస్తున్నాయని, వాటి సంఖ్యను రెట్టింపు చేస్తామని, 22 ఎస్ఎస్‌టీ బృందాల సంఖ్యను కూడా 30కు పెంచుతామని వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో కార్గో సేవల ద్వారా, రైల్వే మార్గం ద్వారా ఏవైనా వస్తువులను ఎన్నికల్లో ప్రలోభాల కోసం పంపిస్తున్నారనే అనుమానం కలిగితే, వెంటనే సమాచారం అందించేలా సంబంధిత అధికారులను అప్రమత్తం చేశామన్నారు.

సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి విస్తృత తనిఖీలు చేస్తూ పలుచోట్ల నగదుతోపాటు మద్యాన్ని పట్టుకున్నామన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేస్తూ అక్రమ నగదు, మద్యం, వస్తువుల పంపిణీ వంటి ప్రలోభాలకు అడ్డుకట్ట వేసేలా గట్టి నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బల్క్ మెసేజింగ్ నిషేధం

సుభాష్‌నగర్: ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో సైలెన్స్ పీరియడ్(నిశబ్ద వ్యవధి) అమలులో ఉంటుందని, 11వ తేదీ సాయంత్రం 6 నుంచి 13న సాయంత్రం 6గంటల వరకు బల్క్ మెసేజింగ్‌ను ఎన్నికల సంఘం నిషేధించిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యంతరకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లను పంపించొద్దని, నిశితంగా పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్‌కు ఒక రోజు ముందు, పోలింగ్ రోజున ప్రింట్ మీడియాలో ఎలాంటి ప్రకటనలు ప్రచురించకూడదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

'ఏకలవ్య' అడ్మిషన్లకు 21వ తేదీ వరకు గడువు

నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గాంధారి (బాలుర), ఇందల్వాయి (బాలికల) ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సంస్థ ప్రాంతీయ సమన్వయ అధికారి టి.సంపత్‌కుమార్, నోడల్ ప్రిన్సిపల్ సోమ్లా నాయక్, ఇందల్వాయి ప్రిన్సిపల్ జి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 వరకు గిరిజన విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 2023–24 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ లేదా స్టేట్ సిలబస్‌లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన గిరిజన విద్యార్థులు సంబంధిత పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపీసీ, బీపీసీ, సీఈసీ గ్రూప్‌లలో ప్రథమ సంవత్సరంలో మాత్రమే ప్రవేశాలు ఉన్నట్లు తెలిపారు. సీట్ల కేటాయింపు మెరిట్ ఆధారంగా మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఇందల్వాయి కళాశాల అడ్మిషన్లకు సంబంధించిన వివరాల కోసం 85019 13274 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గాలివాన బీభత్సం




డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలో గాలివాన బీభత్సం సృషించింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా బలమైన గాలులు వీయడంతో దత్తాపూర్–డొంకేశ్వర్ బైపాస్ రోడ్డుపై పెద్ద వృక్షం నేలకొరిగింది. ఈ ఘటనలో పక్కనే రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు భయాందోళనకు గురయ్యారు. ఈ రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సును వేరే రూట్‌లో మళ్లించారు. వర్షానికి ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

భీమ్‌గల్: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల పరిరక్షణ జిల్లా అధికారి చైతన్యకుమార్ అన్నారు. మండలంలోని చేంగల్‌లో మహిళ, శిశు సంక్షేమశాఖ, బాల రక్ష భవన్‌శాఖ ఆధ్వర్యంలో బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్యకుమార్ మాట్లాడుతూ.. సమాజంలో ఆడ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దురాచారాలను రూపుమాపేందుకు, భ్రుణహత్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్య, ఆరోగ్యం, ఆహార అలవాట్లు, పరిశుభ్రతతో పాటు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రధాన పార్టీల గల్ఫ్ జపం

- గెలుపోటములను ప్రభావితం చేయనున్న వలస కార్మికుల కుటుంబాల ఓటర్లు
- జిల్లాలో సుమారు 3,75,255 లక్షల ఓట్లు
- 'గల్ఫ్‌బోర్డు'పై అభ్యర్థుల హామీలు



మోర్తాడ్(బాల్కొండ): పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములను గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాల ఓట్లు ప్రభావితం చేయనున్నాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య, అందులో గల్ఫ్ వలసకార్మికుల కుటుంబాల ఓట్ల సంఖ్యను పరిశీలిస్తే అభ్యర్థుల భవితవ్యం గల్ఫ్ కార్మికుల కుటుంబాల చేతిలో ఉన్నట్లు వెల్లడవుతోంది. ఈనేపథ్యంలో గత కొన్నేళ్లుగా 'గల్ఫ్‌బోర్డు' ఏర్పాటు డిమాండ్ వలస కార్మికుల నుంచి వినిపిస్తోంది. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి గల్ఫ్ బోర్డు ఏర్పాటుపై సానుకూలంగా స్పందించినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా ఉత్తర్వులను జారీ చేయలేకపోయారు. గల్ఫ్ కార్మికుల కుటుంబాల ఓట్లను దృష్టిలో పెట్టుకొని నిజామాబాద్ స్థానం నుంచి పోటీ చేస్తున్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు గల్ఫ్ అంశాన్ని ఎత్తుకుని ఎవరికి వారే హామీలు ఇస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి గల్ఫ్ బోర్డుకు సుముఖంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ.. దీనికి తన వంతు కృషి చేశానని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రచారంలో చెప్పుకుంటున్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో గల్ఫ్ అంశంపై చర్చ తీసుకువచ్చి బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అంటున్నారు. సిట్టింగ్ ఎంపీ, బీజేపీ తరఫున రెండోసారి బరి లోకి దిగిన ధర్మపురి అర్వింద్ కూడా తాను గల్ఫ్ వలస కార్మికుల కోసం ఎంతో కృషి చేశానని, బోర్డు విషయాన్ని కూడా కేంద్రంతో చర్చిస్తానని చెబుతున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు, గల్ఫ్ వలస కుటుంబాల ఓట్ల సంఖ్య

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	గల్ఫ్ కుటుంబాల ఓట్లు
ఆర్మూర్	2,12,145	54,946
బోధన్	2,23,096	42,243
అర్బన్	3,04,317	46,286
రూరల్	2,56,593	59,303
బాల్కొండ	2,26,792	58,237
కోరుట్ల	2,45,249	57,965
జగిత్యాల	2,36,675	56,275
మొత్తం	17,04,867	3,75,255

గల్ఫ్ ఓటర్ల సంఖ్యపై అంచనాలు ఇలా..

గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి నిర్దిష్టమైన సమాచారం ప్రభుత్వం వద్ద లేకపోయినప్పటికీ.. వలస కార్మిక సంఘాల సహకారంతో ఓట్ల సంఖ్యను అంచనా వేశారు. ఇమిగ్రెంట్స్ ఫోరం చైర్మన్, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు మంద భీంరెడ్డి నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి ఎంత మంది వలస వెళ్లి ఉంటారోనని అంచనావేశారు. ఆయన వెల్లడించిన లెక్కల ప్రకారం గల్ఫ్ దేశాలపై ఆధారపడిన వారి సంఖ్య 1,48,136గా నమోదైంది. గడచిన పదేళ్లలో గల్ఫ్ దేశాలను వీడి ఇంటికి చేరుకున్న ఓటర్ల సంఖ్య 78,983గా ఉంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న కార్మికుడు తన కుటుంబంలోని ఇద్దరు, ముగ్గురు ఓటర్లను ప్రభావితం చేస్తారని మంద భీంరెడ్డి స్పష్టం చేశారు. ఈ లెక్క ప్రకారం గల్ఫ్ రిటర్నీలు, వలస దారుల కుటుంబ సభ్యుల ఓట్ల శాతం 22.21 వరకు ఉందని ఆయన వెల్లడించారు. గల్ఫ్ కుటుంబాల ఓట్లు కీలకం కావడంతో అభ్యర్థులు ఎవరికి వారు వలస కార్మికుల కుటుంబాలకు దగ్గర కావాలని ప్రయత్నిస్తున్నారు.

మరో పోరాటానికి కేసీఆర్ సిద్ధం



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

ఆర్మూర్: ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ మాజీ సీఎం కేసీఆర్ మరో పోరాటానికి సిద్ధమవుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో గురువారం రోడ్‌షో నిర్వహించారు. దోభీఘాట్ నుంచి కాశీహనుమాన్ గల్లీ, గోల్‌బంగ్లా మీదుగా రోడ్‌షో సాగింది. గోల్‌బంగ్లా వద్ద బాజిరెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ పసుపు బోర్డు పేరుతో రైతులను మోసం చేయడం తప్పా చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మోసాలను ప్రజలు గ్రహించాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే పసుపు బోర్డుపై పార్లమెంట్‌లో గళమెత్తుతానని, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తా



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే జంక్షన్ అభివృద్ధికి నోచుకోలేదని, తాను గెలుపొందిన తరువాత నిజామాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను జీవన్‌రెడ్డితోపాటు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని విమర్శించారు. నిజామాబాద్ రైల్వే లైన్ డబ్లింగ్ చేస్తే ప్రయాణికులకు సౌకర్యాలు ఏర్పడుతాయని అన్నారు. ఆర్మూర్ నుంచి అదిలాబాద్‌కు రైల్వే లైన్ కలిపితే నార్త్ ఇండియాకు సంబంధాలు పెరుగుతాయని అన్నారు. బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్నారు. వారివెంట నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, విపుల్‌గౌడ్, ప్రవీణ్, కోనేరు సాయికుమార్, లవంగ ప్రమోద్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయం



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఆర్మూర్‌టౌన్/పెర్కిట్: తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఉసురు తగిలి త్వరలో కూలిపోతుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. పట్టణంలో గురువారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షోలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డితో కలిసి అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి హోదా మరిచి హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ప్రసంగించారన్నారు. తెల్ల రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో అర్హులు ప్రభుత్వ పథకాలను కోల్పోవాల్సి వస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డులను మూడు నెలల్లో ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. నాయకులు పల్లె గంగారెడ్డి, జీవీ నర్సింహారెడ్డి, కంచెట్టి గంగాధర్, యామాద్రి భాస్కర్, అమ్దాపూర్ రాజేశ్, ద్యాగ ఉదయ్, పోల్కం వేణు, మందుల బాలు తదితరులు పాల్గొన్నారు. 16వ వార్డు కౌన్సిలర్ సుంకరి ఈశ్వరీ రంగన్న ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు.

పని చేయని వాళ్లకు ఓటేయొద్దు



పోతంగల్‌లో మాట్లాడుతున్న పోచారం

పోతంగల్(రుద్రూర్): పదేళ్లు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్, అంతకు ముందు ఐదేళ్లు ఎంపీగా ఉన్న సురేశ్ షెట్కార్ ఏం పని చేయలేదని, వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పోతంగల్ మండలం లింగాపూర్, కల్లూర్, జల్లాపల్లి ఆబాది, జల్లాపల్లి ఫారం, పోతంగల్, దోమలెడ్గి, కోటగిరి మండలం ఎత్తొండ, కోటగిరి గ్రామాల్లో గురువా రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాన్సువాడ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఎంపీగా బీఆర్ ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని అన్నారు. పోచారం సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ శంకర్‌పటేల్, మండల పార్టీ అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్, జెడ్పీ కో ఆప్షన్‌సభ్యుడు సిరాజ్, నాయకులు కూచి సిద్ధు, పత్తి లక్ష్మణ్, శ్రీధర్, అబీద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వరుస చోరీలు

- పనిచేయని సీసీ కెమెరాలు
- రోగుల వస్తువులకు భద్రత కరువు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వరుస చోరీలు జరుగుతున్నాయి. రోగులు, వారి సంబంధీకుల వస్తువులు, వాహనాలకు రక్షణలేకుండాపోతోంది. జనరల్ ఆస్పత్రి సెక్యూరిటీగార్డు రవి బైక్‌ను దుండగులు బుధవారం ఎత్తుకెళ్లారు. ఉదయం వేళ విధులకు హాజరైన రవి పార్కింగ్ స్థలంలో తన బైక్ (ఏపీ 25 ఏకే 6775)ని పార్కింగ్ చేశాడు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో చూస్తే బైక్ కనిపించలేదు. అక్కడి సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దుండగులను గుర్తించడం కష్టంగా మారింది. ఇటీవల ఓ గర్భిణీకి సహాయకురాలిగా వచ్చిన మహిళ బంగారు గొలుసు అపహరణకు గురైంది. అంతేకాకుండా వందకుపైగా సెల్ ఫోన్లను తస్కరించారు. జిల్లా జనరల్ ఆస్పత్రికి సీఐఎస్ఎఫ్ రక్షణతోపాటు స్థానిక పోలీసుల రక్షణ వ్యవస్థ ఉంది. ఇదే కాకుండా డజనుకి పైగా సెక్యూరిటీ గార్డులు 24 గంటలూ సేవలందిస్తున్నారు.

మందుబాబుల అడ్డా బోధన్ ఆస్పత్రి

బోధన్‌టౌన్(బోధన్): వైద్య సేవలందించే జిల్లా దవాఖాన మందుబాబులకు అడ్డాగా మారింది. దవాఖానలోని చెత్త డబ్బాల్లో మెడికల్ సంబంధిత వ్యర్థాలతోపాటు మందుబాటిళ్లు గురువారం దర్శనమిచ్చాయి. మందు బాబులు కొందరు ఆస్పత్రిని అడ్డాగా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రి ఆవరణలోకి మందుబాబులు రాకుండా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు.



బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డస్ట్ బిన్‌లో బీర్ బాటిళ్లు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బీబీపేట: రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. తుజాల్‌పూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ గ్రామానికి చెందిన కిరాణం షాప్ యజమాని పంచాక్షరి శ్రీనివాస్ (50) వ్యక్తిగత పనులపై తుజాల్‌పూర్‌కు బైక్‌పై వెళ్తుండగా రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. గోప వివేక్ అనే వ్యక్తి ఆరబోసిన వడ్లను నింపేందుకు ట్రాక్టర్‌ను రోడ్డుపై నిలిపి ఉంచగా, బైక్ అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో శ్రీనివాస్ తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని వెంటనే కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ట్రాక్టర్ యజమాని గోప వివేక్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు.

పిడుగుపాటుకు ఆవులు మృతి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని శ్రీరాంనగర్‌తండా గ్రామపరిధిలో గల హన్మ్యానాయక్ తండాలో రాథోడ్ శ్రీనివాస్‌కు చెందిన రెండు ఆవులు పిడుగుపాటు కారణంగా మృత్యువాతపడ్డాయి. రోజూలాగే శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆవులను మేత కోసం బుధవారం సాయంత్రం తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగుపడడంతో ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు శ్రీనివాస్ కోరాడు.



ఘటనాస్థలంలో ఆవుల కళేబరాలు

అప్పు దొరక్క యువకుడి బలవన్మరణం



నవీన్(ఫైల్)

మాచారెడ్డి: ఆటో బాగు చేయించుకోడానికి అప్పు పుట్టకపోవడంతో మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చంద్రునాయక్ తండాలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన లావుడ్యా నవీన్(21) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఆటో చెడిపోవడంతో రిపేర్ కోసం అప్పు దొరకకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డబ్బుల విషయంలో భర్తతో గొడవ కారణంగా..

ఖలీల్‌వాడి: డబ్బుల విషయంలో భర్తతో గొడవ జరగడంతో భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో చోటు చేసుకుంది. ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాగారంలోని 300 క్వార్టర్స్‌కు చెందిన కావేరి, సంతోష్ భార్యాభర్తలు. వీరి మధ్య బుధవారం రాత్రి డబ్బుల విషయంలో గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన కావేరి(35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

శ్మశానవాటికలో చెట్టుకు ఉరేసుకొని..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాల కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కళ్యాణిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బండారి గంగారాం (31) కొద్దినెలలుగా మెదక్ జిల్లా అల్లాదుర్గంలోని అత్తవారింట్లో ఉంటూ అక్కడే పని చేస్తున్నాడు. భార్యతో గొడవ కారణంగా వారం రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన గంగారాం గ్రామ శివారులోని శ్మశాన వాటికలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చెరువులో దూకిన యువకుడు!

దోమకొండ: కుటుంబ, ఆర్థిక సమస్యల కారణంగా మండల కేంద్రానికి చెందిన గోత్రాల విక్రమ్(28) అనే యువకుడు గురువారం చెరువులో దూకాడు. చివరగా తన మిత్రుడైన ప్రవీణ్‌కు వీడియోకాల్ చేసిన విక్రమ్.. తాను చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. విషయం తెలుసుకున్న దోమకొండ ఎస్సై గణేశ్ అక్కడికి చేరుకుని ఈతగాళ్లతో గాలించినప్పటికీ.. చీకటి, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, వర్షం కారణంగా విక్రమ్ ఆచూకీని కనుక్కోలేకపోయారు. నీటిలో చెప్పులు తేలాయి. విక్రమ్ మృతి చెంది ఉంటాడని పోలీసులతోపాటు గ్రామస్తులు పేర్కొంటున్నారు. విక్రమ్ పాములు పట్టడంతో పాటు యూట్యూబ్ చానల్ విలేకరిగా సైతం పని చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



విక్రమ్(ఫైల్)

రూ.7 లక్షల విలువైన సెల్‌ఫోన్లు రికవరీ



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు పోగొట్టుకున్న రూ.7 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 37 ఫోన్లను గుర్తించి పోగొట్టుకున్న వారికి తిరిగి అప్పగించామని అన్నారు. సెల్‌ఫోన్లు తిరిగిపొందిన వారు ఈ సందర్భంగా పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గాజులగల్లీకి చెందిన గోజారి సంగీత (50) అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సంగీత కుమార్తె ఝాన్సీ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వైన్ షాపు సీజ్



ఖలీల్‌వాడి: మద్యాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్న నగరంలోని పరమేశ్వరి వైన్‌షాపును సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ తెలిపారు. బ్రాండెడ్ విస్కీలో చీప్ లిక్కర్ కలిపి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ తుల శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది వైన్‌షాపులో గురువారం తనిఖీలు నిర్వహించారు. 37 ఫుల్‌బాటిళ్లను స్వాధీనం చేసుకొని వైన్‌షాపును సీజ్ చేశారు. తనిఖీల్లో ఎస్సైలు మల్లేశ్, సుష్మిత, సింధు, సిబ్బంది, ధరిసింగ్, మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీ

మాక్లూర్: మండల కేంద్రంలోని రేణుకాఎల్లమ్మ, ఢీకంపల్లి గ్రామ పెద్దమ్మతల్లి ఆలయాల్లో దుండగులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. రెండు ఆలయాల్లోని సుమారు 12గ్రాముల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఆయా గ్రామాల వీడీసీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన కావేరి ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కావేరి భర్త ఉపాధినిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. గత నెల 28వ తేదీన కావేరి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా, బుధవారం రాత్రి దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని రూ.40వేల నగదు, తులం బంగారం ఎత్తుకెళ్లారు. ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసిన చుట్టుపక్కల వారు గురువారం ఉదయం కావేరికి సమాచారం అందించారు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్కారాయుళ్ల అరెస్ట్

ఎడపల్లి(బోధన్) : మండల కేంద్రంలోని వీక్లీ మార్కెట్ పక్కన మట్కా ఆడుతున్న ఐరెన్ల గంగాధర్, ఇర్ఫాన్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై వంశీధర్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇరువురిని గురువారం అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుంచి మట్కా చిట్టీలతోపాటు రెండు సెల్ ఫోన్లు, రూ.1510 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్, ఆయిల్ చోరీ



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద ఎత్తిపోతల పథకం మొదటి పంప్‌హౌజ్ వద్ద సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎత్తిపోతల కమిటీ సభ్యులు గురువారం ఉదయం పంపుహౌజ్‌లోని మోటార్లను ప్రారంభించి నీటిని సరఫరా చేసేందుకు మొదటి పంపుహౌజ్ వద్దకు వెళ్లారు. సబ్‌స్టేషన్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలో వ్యర్థ సామగ్రి పడి ఉండడంతో అనుమానం వచ్చి వెళ్లి చూడగా.. సబ్‌స్టేషన్‌లోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై కనిపించాయి. దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైరు, ఆయిల్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఎత్తిపోతల కమిటీ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హాజీపూర్ తండాలో..



ఎల్లారెడ్డి: మండలంలోని హాజీపూర్‌తండా శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్, కాయిల్స్ చోరీకి గురైనట్లు ఎస్సై మహేశ్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి దుండగులు కాట్రోత్ లింబ్యా పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్, కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఖలీల్‌వాడి: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఆరుగురికి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటనారాయణ గురువారం కౌన్సెలింగ్ ఇచ్చి కోర్టులో హాజరుపరిచారన్నారు. మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఐదుగురికి రూ.3200 జరిమానా, మరో వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి నుంచి బాగేపల్లికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కూనేపల్లి వద్ద టిప్పర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించి తహసీల్దార్‌కు అప్పగించామన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ట్రిపుల్.. ట్రబుల్

- వర్సిటీని వేధిస్తున్న నిధుల కొరత
- చాలా బిల్లులు పెండింగ్‌లోనే
- నాలుగేళ్లుగా మొక్కుబడిగా కేటాయింపులు
- సీట్ల కుదింపు ఆలోచనలో అధికారులు
- ప్రభుత్వం దృష్టి సారిస్తేనే పరిష్కారం



భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ ఇప్పటి వరకూ విడుదల కాలేదు. ఏప్రిల్ 30న పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులనే బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో చేర్చుకుంటారు. ఏటా అడ్మిషన్లకు సంబంధించి కమిటీ వేస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కమిటీ వేయనట్లు సమాచారం. పైగా గతేడాది 1500 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఈ ఏడాది 500 సీట్లు తగ్గిస్తారని ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ట్రిపుల్‌ఐటీని నిధుల కొరత వెంటాడుతున్నట్లు తెలిసింది. ఏపీలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలకు నోటిఫికేషన్ రావడంతో విద్యార్థులంతా బాసరలోనే నోటిఫికేషన్ వచ్చిందని పొరపాటుపడుతున్నారు. ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ నోటిఫికేషన్ సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతోంది. అందులో పూర్తిగా చదివితే ఏపీ నోటిఫికేషన్ అని తెలిసి మన బాసర నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందని అడుగుతున్నారు. ఇక ఈ విద్యాసంవత్సరంలో 1000 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారా? లేక గతేడాది లాగా 1500 మందినే చేర్చుకుంటారా? అనేది తెలియడం లేదు.

నిధుల కొరత...

బాసర ట్రిపుల్‌ఐటీని నాలుగేళ్లుగా నిధుల కొరత వెంటాడుతోంది. కాంట్రాక్టర్లకు సంబంధించిన రెండు నెలల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధులు లేక విద్యార్థుల మౌలిక సౌకర్యాల ఏర్పాటులో ఆటంకం కలుగుతోంది. ఇందులో పనిచేసే ఉద్యోగుల వేతనాలు తప్పా మిగతా అన్ని చెల్లింపుల్లోనూ జాప్యం కనిపిస్తోంది. విద్యార్థులకు భోజన వసతి కల్పించే సంస్థలకు హౌజ్‌కీపింగ్, సెక్యూరిటీ, కాంట్రాక్టర్లకు ప్రతీనెల రూ.4 కోట్ల నిధులు అవసరం. విద్యుత్ బిల్లులు, ఇతర అవసరాల కోసం రూ.2 నుంచి రూ.3 కోట్ల అవసరం ఉంటుంది. నిధుల కొరత కారణంగా బిల్లులు చెల్లించడం లేదు. విద్యార్థుల అవసరాల దృష్ట్యా కొన్నింటికి 15 రోజుల్లో మరికొన్ని నెలవారీగా బిల్లులు చెల్లించాలి. కానీ నిధులు లేక మూడు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదు. నిధులు లేక విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, యూనిఫామ్స్ సకాలంలో అందించలేకపోతున్నారు.

పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు

బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రూ.50 కోట్ల మేర స్కాలర్‌షిప్ నిధులు విడుదల కావాల్సి ఉంది. క్యాంపస్ అధికారులు బీసీ, ఎస్సీ, మైనార్టీ వెల్ఫేర్ శాఖల అధికారులను పలుమార్లు సంప్రదించినా నిధులు మాత్రం విడుదల చేయలేదు. ఏ విద్యాసంవత్సరానికి సంబంధించిన స్కాలర్‌షిప్‌లు అదే ఏడాది ఇవ్వాలి. కానీ నిధులు లేకపోవడంతో ఇవ్వడంలేదు.

ఈ ఏడాది మళ్లీ సమస్యలే!

ఈ విద్యాసంవత్సరంలో మళ్లీ సమస్యలే ఎదురు కానున్నాయి. నిధులు లేక నోటిఫికేషన్ ఆలస్యమవుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా చేరే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి. పైగా సీట్ల సంఖ్యపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఎన్ని సీట్లు భర్తీ చేయాలన్న విషయం క్యాంపస్ అధికారులు కూడా ప్రకటించడంలేదు. అధికారంలోకి రాకముందు ప్రతిపక్ష హోదాలో ట్రిపుల్‌ఐటీ సమస్యలపై పోరాడిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని పలువురు విమర్శిస్తున్నారు.

బడ్జెట్‌లోనూ అంతంతే...

బాసర ట్రిపుల్‌ఐటీకి ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో రూ. 30 కోట్ల వరకు కేటాయిస్తుంది. ఈ నిధుల్లో 50 శాతం మాత్రమే యూనివర్సిటీకి చేరుతున్నాయి. కేటాయించిన నిధులే యూనివర్సిటీకి సరిపోవడంలేదు. అందులోంచి 50 శాతమే విడుదలచేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రిపుల్‌ఐటీకి సంబంధించిన డిపాజిట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. మిగులు నిధులను గతంలో పనిచేసిన అధికారులు దూర దృష్టితో యూనివర్సిటీ పేరిట డిపాజిట్లు చేశారు. క్యాంపస్‌లో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడల్లా ఈ డిపాజిట్లను డ్రాచేస్తున్నారు. రెండు నెలల కాలంలో రూ.8 కోట్లు డ్రా చేసినట్లు సమాచారం. మళ్లీ ఇప్పుడు డిపాజిట్ల వైపే చూస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగైదేళ్ల క్రితం రూ.300 కోట్లు ఉన్న డిపాజిట్లు ప్రస్తుతం రూ.20 కోట్లకు వచ్చినట్లు తెలుస్తోంది. నిధులు లేక ఈ డిపాజిట్లు కూడా కరిగిపోతున్నాయి.

ఉద్యోగుల వేతనాలు చెల్లిస్తున్నాం

ట్రిపుల్‌ఐటీలో పనిచేసే ఉద్యోగులకు వేతనాలు ఆపడంలేదు. ప్రతీనెల వేతనాలు చెల్లిస్తున్నాం. నిధుల కొరత ఉన్నప్పటికీ ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. నిధుల కొరత వల్ల సంస్థలు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. త్వరలోనే నిధుల సమస్య తీరుతుంది.

– వెంకటరమణ, వీసీ, బాసర ట్రిపుల్‌ఐటీ

మాతృవేదన

- గర్భంలోనే శిశువు మృతి
- రూ.80వేల బిల్లు కోసం ప్రైవేట్ ఆస్పత్రి వేధింపులు
- కుటుంబీకుల ఆందోళన



డాక్టర్ ఇచ్చిన బిల్లు



బాధిత కుటుంబ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: మాతృత్వం ప్రతీ మహిళకు వరం లాంటిది.. అలాంటి మధురానుభూతిని పొందాల్సిన ఓ మహిళ ప్రైవేట్ ఆస్పత్రి ధనదాహంతో వేదనకు గురైన ఘటన కలచివేస్తోంది. సురక్ష ప్రసవం చేసి తల్లి, బిడ్డను కాపాడాల్సిన వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడ్డారు. గర్భంలోనే శిశువు మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ మాతృమూర్తికి ఓదార్పునివ్వాల్సింది పోయి బిల్లులు చెల్లించే దాకా ఆస్పత్రి నుంచి కదలనివ్వకుండా అడ్డుపడ్డారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం వెలుగు చూసింది. ప్రసవం కోసం రాష్ట్రం దాటి వచ్చిన ఆ దంపతులకు రూ.35వేలు ఖర్చవుతుందని తెలిపిన ఆస్పత్రి వైద్యులు, తీరా రూ.80వేల బిల్లు చేసి వాటిని బలవంతంగా వసూలు చేయడం ఆస్పత్రి ధన దాహానికి నిదర్శనం. డబ్బులు చెల్లిస్తే గాని డిశ్చార్జ్ చేయమన్న వైద్యుల తీరును అంతా అసహ్యించుకుంటున్నారు.

ఏం జరిగిందంటే..

ఆదిలాబాద్ పట్టణంలోని టీఎస్జీవో సమీపంలో ద్వారకానగర్‌లో గల ఓ గైనిక్ ఆస్పత్రిలో మహారాష్ట్రలోని ఉమర్‌ఖేడ్ జిల్లా బీటర్‌గాంకు చెందిన లక్ష్మి డెలివరీ కోసం గతనెల 28న ఆస్పత్రిలో చేరింది. లక్ష్మికి రక్తం తక్కువగా ఉందని వైద్యురాలు సూచించారు. రక్తం ఎక్కించి డెలివరీ చేస్తామని చెప్పారు. ఇందుకు రూ.35వేల ఫీజు అవుతుందని కుటుంబీకులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అదేరోజు ఆమెకు సిజేరియన్ చేయగా గర్భంలోనే శిశువు మృతిచెందింది. అయితే ఈ చికిత్స కోసం మొదట ఆమె కుటుంబీకులు రూ.25వేలు ఆస్పత్రిలో చెల్లించారు. మిగతా రూ.10వేల కోసం ఆమె భర్త రామ్ స్వగ్రామానికి వెళ్లాడు. డబ్బులు లభించకపోవడంతో వారంపాటు ఆస్పత్రికి రాలేదు. గురువారం డబ్బులతో వచ్చిన రామ్ చెల్లించేందుకు కౌంటర్ వద్దకు వెళ్తే సిబ్బంది రూ.80వేల బిల్లు అయ్యిందని చూపించగా రామ్ ఖంగుతిన్నాడు. ఇదేమిటని అడిగితే 10 బాటిళ్ల వరకు రక్తం ఎక్కించామని, భోజనం పెట్టామని, డాక్టర్ ట్రీట్‌మెంట్ కోసం రూ.50వేలు, రక్తం ఎక్కించినందుకు రూ.10వేలు, మందుల కోసం రూ.10వేలు, సిబ్బంది పరిశీలన, ఇతర ఖర్చులు చూపించి రూ.10వేల బిల్లు చేసి ఇచ్చారు. వేడుకున్నప్పటికీ బిల్లు తగ్గించకుండా ససేమిరా అన్నారు. బిల్లు చెల్లించిన తర్వాతే తన భార్యను ఇంటికి తీసుకెళ్లాలని, అప్పటివరకు ఇక్కడే ఉంటుందని సిబ్బంది సూచించారు. మహారాష్ట్రకు చెందిన ఆ వ్యక్తికి ఇక్కడ బంధువులెవరూ లేరు. ఈ విషయం తెలుసుకున్న ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కొందరు అక్కడికి వెళ్లి డాక్టర్‌ను నిలదీశారు. ఇదేమిటని అడిగితే ఆపరేషన్, ఇతర ఖర్చులకు రూ.80వేలు అవుతుందని చెప్పారు. కొంత ఆందోళన చోటుచేసుకోవడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. డాక్టర్‌ను ఒప్పించి కొంత డిస్కౌంట్ ఇప్పించి మిగతా డబ్బులు చెల్లించడంతో మహిళను డిశ్చార్జ్ చేశారు.

కార్మిక వ్యతిరేక పార్టీ బీజేపీ

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం, ఎమ్మెల్యే వివేక్

జైపూర్: దేశంలో మతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని ఓడించాలని, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను 4కోడ్‌లుగా మార్చిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యతో కలిసి మాట్లాడారు. రాజ్యాంగం మార్పు పేరుతో దేశాన్ని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్న బీజేపీకి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని అన్నారు. అదానీ, అంబానీ వంటి ధనవంతులకు రూ.16లక్షల కోట్లు రుణమాఫీ చేసిన ప్రధాని సామాన్య ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కేబాజీ సైదా, సంయుక్త కార్యదర్శి సంపత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో దేశం వెనుకబడింది..

- బీజేపీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జి మురళీధర్‌రావు
- మంచిర్యాలలో కార్నర్ మీటింగ్



మురళీధర్‌రావుకు నాయకుల స్వాగతం

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిందని, నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాకనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని బీజేపీ సీనియర్ నాయకులు, మధ్యప్రదేశ్ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి మురళీధర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అధ్యక్షతన గురువారం మంచిర్యాలలో ఓవర్‌బ్రిడ్జి, ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, వెంకటేశ్వర టాకీస్, అర్చనటెక్స్ చౌరస్తాల మీదుగా శ్రీనివాస టాకీస్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో మురళీధర్‌రావు మాట్లాడారు. గత పదేళ్లుగా ప్రధాని మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి, దేశ అభివృద్ధి కోసం పనిచేస్తోందని తెలిపారు. దేశంలోని అన్ని రంగాల్లో మౌలిక వసతులు కల్పించి, దేశాభివృద్ధికి ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు ముల్కల్ల మల్లారెడ్డి, రజనీశ్‌జైన్, ఆనంద్ కృష్ణ, పానుగంటి మధు, తుల ఆంజనేయులు, రఘునందన్, కొయ్యాల ఏమాజి, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, బోయిని హరికృష్ణ పాల్గొన్నారు.

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కేవీఎం శ్రీనివాస్ మంచిర్యాలలో మురళీధర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

మాన్కాపూర్‌లో మద్యపాన నిషేధం

- ఉల్లంఘిస్తే గ్రామబహిష్కరణ
- గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



సమావేశమైన గ్రామ పెద్దలు, గ్రామస్తులు

నార్నూర్: మద్యానికి బానిసై యువత చెడు మార్గాల వైపు వెళ్తున్న తరుణంలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాన్కాపూర్ గ్రామస్తులు ఓ నిర్ణయానికి వచ్చారు. గురువారం గ్రామ పటేల్ మెస్రం రూప్‌దేవ్ అధ్యక్షతన సమావేశమై గ్రామంలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. మద్యం సేవించడంతో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు మర్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో చిన్నాపెద్దా తేడా లేకుండా మర్యాద కోల్పోతున్నారని తెలిపారు. గ్రామంలో ఎవరైనా మద్యం సేవించినా, విక్రయించినా గ్రామం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావ్, సీతారాం, షెడ్మారావు, బాధిరావు, కొట్నాక్ నానాజీ, భీంరావ్, ఎత్మారావు, సుంగు తదితరులున్నారు.

జోరందుకున్న సజ్జ కోతలు

- ఈ ఏడాది రికార్డు ధర
- సాగు తగ్గడంతో పెరిగిన డిమాండ్



నాగంపేట్‌లో సజ్జ పంటను కోస్తున్న రైతులు

బాల్కొండ: సజ్జ పంట కోతలు జోరందుకున్నాయి. ఈ ఏడాది సాగు తగ్గడంతో సజ్జలకు రికార్డు స్థాయిలో ధరను వ్యాపారులు పెంచారు. వాణిజ్య పంట కావడంతో విత్తన సరఫరా చేసిన వ్యాపారులే పంట దిగుబడిని కూడా కొనుగోలు చేయాలి. అంతే కాకుండా ధర కూడ ముందే ఒప్పందం చేసుకుంటారు. క్వింటాలుకు రూ.7,500 నుంచి 8 వేల వరకు వ్యాపారులు సజ్జ పంట కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. సజ్జ పంట సాగు చేస్తున్నప్పటి నుంచి ఇంత ధర ఎప్పుడు కూడా పలకలేదని రైతులు అంటున్నారు. గరిష్ఠంగా క్వింటాలుకు రూ.6 వేలు మాత్రమే పలికింది. పసుపు పంట సాగు చేసిన నేలల్లోనే సజ్జ పంటను సాగు చేస్తారు. ఈ ఏడాది పసుపు సాగు కూడా తగ్గించారు. దీంతో సజ్జ పంట సాగు కూడా తగ్గింది. సజ్జ పంటను జనవరి మధ్య మాసం నుంచి విత్తుతారు. 90 రోజుల్లో పంట చేతికి వస్తుంది. మరో వారం రోజుల్లో సజ్జ కోతలు పూర్తవుతాయి.

అకాల వర్షాలతో ఆందోళన..

మరో రెండు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ కేంద్రం హెచ్చరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సజ్జ పంటకు రికార్డు స్థాయిలో ధర ఉండటంతో లాభం కలిసి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. కానీ అకాల వర్షం పడుతుందేమోనని కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

భత్యం చెల్లింపులోనూ వివక్ష

- ప్రచారంలో మగవారితో పోలిస్తే ఆడవారికి తక్కువ డబ్బులు చెల్లింపు
- అసహనం వ్యక్తం చేస్తున్న మహిళలు

మోర్తాడ్: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల ప్రచారంలో వేగం పుంజుకుంది. ఇంటింటా ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్న మూడు ప్రధాన పార్టీల నాయకులు, ఈ ప్రచారానికి వచ్చే మహిళలకు తక్కువ భత్యం ఇస్తూ మగవారికి ఎక్కువ చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రచార బాధ్యతలు నిర్వహించిన వారితో పాటు రాజకీయ నాయకుల సభలకు హాజరయ్యే వారికి భత్యం చెల్లించడంలో తేడా చూపుతున్నారని మహిళలు పేర్కొంటున్నారు. మగవారికి రోజుకు రూ.350 చొప్పున చెల్లిస్తే ఆడవారికి మాత్రం రూ.250 ఇచ్చి సరిపెడుతున్నారు. దీంతో మహిళలు రాజకీయ పార్టీల నేతల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అన్ని పార్టీల విధానం ఒకేలా ఉండటంతో చేసేది లేక ప్రచారం, రాజకీయ నాయకుల సమావేశాలకు హాజరవుతున్నారు. ఇదిలా ఉండగా ఏ కార్యక్రమానికైనా మగవారి కంటే ఆడవారే ఎక్కువ మంది వస్తుండటంతో భత్యం చెల్లించడంలో తేడా చూపాల్సి వస్తుందని నాయకులు చెబుతున్నారు. సభలు, సమావేశాలైనా, ఇంటింటా ప్రచారమైనా ఆడవారే ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో వారికి తక్కువ భత్యం చెల్లిస్తున్నామని నాయకులు చెబుతున్నారు. మగవారు తక్కువ మంది హాజరవుతుండటంతో వారికి ఎక్కువ భత్యం చెల్లించి సాగనంపుతున్నామని నాయకులు పేర్కొంటున్నారు.

బూత్ కమిటీలకు ప్రచార బాధ్యతలు

- ఓట్ల కోసం ప్రధాన పార్టీల వ్యూహం
- ఇంటింటా ప్రచారానికి ప్రాధాన్యం



మోర్తాడ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆలూర్‌లో బీజేపీ నాయకురాలు

మోర్తాడ్ : నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో మూడు ప్రధాన పార్టీల ముఖ్య నేతల పర్యటనలు ముగియడంతో ఇంటింటి ప్రచారంపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు బూత్ కమిటీలకు కీలక బాధ్యతలను అప్పగించారు. బూత్ కమిటీలను మండల, అసెంబ్లీ నియోజకవర్గాల నేతలు సమన్వయం చేస్తూ ప్రచారంలో వేగం పెంచారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఓటరు స్లిప్పులు పంపిణీ చేయడంతో పాటు వీవీ ప్యాట్‌ల ద్వారా ఎలా ఓటు వేయాలి ఎవరికి ఓటు వేయాలని అవగాహన కల్పిస్తున్నారు. పార్లమెంట్ స్థానం పరిధిలోని 1,808 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర నేతలు ఇదివరకే జిల్లాలో పర్యటించారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌లు ప్రచారంలో ఎవరికి వారే పోటీ పడుతున్నారు. శనివారం సాయంత్రంతో ప్రచారం ముగిసిపోనుండగా బూత్ కమిటీల ద్వారా ప్రతి ఇంటికి చేరేలా అభ్యర్థులు ప్రణాళికలు వేసుకుంటున్నారు. అభ్యర్థులు అన్ని గ్రామాలను చుట్టే అవకాశం లేకపోవడంతో మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాలు, మున్సిపాలిటీలలో ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థులు వెళ్లలేని గ్రామాల్లో బూత్ కమిటీలే కీలకంగా వ్యవహరిస్తున్నాయి. తమ బూత్‌లో ఎక్కువ ఓట్లు వస్తే తమకు గుర్తింపు ఉంటుందని బూత్ కమిటీల నాయకులు అంకిత భావంతో ప్రచారం చేస్తున్నారు.

ఇంకా రెండు రోజులే!

- రేపు సాయంత్రంతో ప్రచారానికి తెర
- క్యాంపెయినింగ్‌లో నేతలు బిజీ
- నేడు కామారెడ్డిలో బీజేపీ బైక్ ర్యాలీ
- రేపు ప్రియాంకగాంధీ, రేవంత్ సభ



సాక్షి, కామారెడ్డి : సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి మరికొద్ది గంటల్లో తెరపడనుంది. రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో వీలైనంత ఎక్కువ మంది జనాల దగ్గరికి వెళ్లడానికి ఆయా రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఇరవై రోజులుగా జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఆయా మండలాల్లో ప్రచారం చేశారు. అభ్యర్థుల తరపున రాష్ట్ర, జాతీయ నాయకులు వివిధ ప్రాంతాల్లో జరిగిన సభలు, రోడ్‌షోలలో పాల్గొన్నారు. ఎలాగైన విజయం సాధించాలనే పట్టుదలతో ఆయా పార్టీల పెద్దలు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు.

ఇంటింటికీ తిరుగుతూ..

ప్రచారానికి రెండు రోజులే మిగిలి ఉండటంతో గ్రామాలు/పట్టణాల్లో స్థానిక నేతలు, కార్యకర్తలు తమకు కేటాయించిన ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి తమ పార్టీని గెలిపించాలని వేడుకుంటున్నారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజక వర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ మూడోసారి బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ మరోసారి లోక్‌సభలో అడుగుపెట్టాలని ఆరాటపడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా అనిల్‌కుమార్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా బరిలో దిగారు. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మూడు పార్టీలకు క్యాడర్ ఉంది. ఈ ఎన్నికలు మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం కావడంతో ఆయా పార్టీల ముఖ్యనేతలంతా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇదే సమయంలో ఇంటింటి ప్రచారంపై ఆయా పార్టీల నేతలు దృష్టి సారించారు. అయోధ్యలో రామాలయాన్ని నిర్మించిన మోదీకి మూడోసారి పట్టం కట్టాలని బీజేపీ శ్రేణులు కోరుతున్నాయి. ఐదు నెలల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలు చూసి ఓటు వేయాలని కాంగ్రెస్ కార్యకర్తలు వేడుకుంటున్నారు. రాష్ట్రం సాధించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నేతలు ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

సమయం లేదు మిత్రమా

పోలింగ్‌కు సమయం సమీపిస్తుండటంతో అభ్యర్థులతో పాటు, నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 10న కామారెడ్డి పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు నేతలు తెలిపారు. శుక్రవారం బాన్సువాడ, ఎల్లారెడ్డిలో నిర్వహించే రోడ్‌షోలలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పాల్గొననున్నారు. ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 11న కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు చేశారు.

పసుపు ధర పరుగులు

- క్వింటాలుకు రూ. 17వేల వరకు పలుకుతున్న ధర
- సీజన్ ముగియనున్న తరుణంలో పెరుగుతుందంటున్న రైతులు



నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు నిల్వలు

మోర్తాడ్(బాల్కొండ): పసుపు పంట ధర పరుగులు పెడుతోంది. పసుపు సీజన్ ముగిసిపోతున్న తరుణంలో నిజామాబాద్ మార్కెట్‌లో క్వింటాలుకు రూ. 15వేల నుంచి రూ. 17వేల వరకు ధర పలుకుతోంది. సీజన్ ఆరంభంలో ఎక్కువ సందర్భాల్లో రూ. 13వేల వరకే ధర లభించింది. పసుపు సాగుచేస్తున్న నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్ జిల్లాల్లోనూ ఆశించిన దిగుబడి లభించకపోవడం.. దీనికి తోడు ఎగుమతులు పెరగడంతో పసుపునకు ధర గణనీయంగా పెరిగిందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పసుపు పంటకు ధర పెరుగుతోందని బీజేపీ నేతలు చెబుతున్నారు. పసుపు బోర్డు ప్రకటన ధరకు పెరుగుదలకు ఊతం ఇచ్చిందని పేర్కొంటున్నారు. ఎన్నికల సీజన్ కావడంతోనే రాజకీయంగా లబ్ధి పొందడానికి నాణ్యత ఉన్న పసుపునకు ఎక్కువ ధర చెల్లించేలా రహస్య ఒప్పందం చేసుకున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఏది ఏమైనా ప్రస్తుతం ధర పెరగడంతో తమకు లబ్ధి చేకూరుతోందని పలువురు రైతులు చెబుతున్నారు.

“ప్రతి సీజన్‌లో ఇలాగే ఉండాలి



ప్రతి సీజన్‌లో పసుపు పంటకు ఎక్కువ ధర లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలి. ఎప్పుడో ఒకసారి ధర పెరిగినంత మాత్రాన రైతులకు లాభం జరగదు. పసుపు సాగు కోసం రైతులు భారీగా పెట్టుబడి పెడుతున్నారు. ఏళ్లుగా ధర లభించక ఒక సీజన్‌లో ఎక్కువ రేటు వస్తే గతంలో జరిగిన నష్టాలకు బాధ్యత ఎవరు వహిస్తారు. రైతుల పక్షాన ఆలోచిస్తే మంచిది.

– సంజీవరెడ్డి, రైతు నాయకుడు, దొన్కల్

తక్కువ మంది రైతులకే లాభం



పసుపు పంటకు ధర పెరగడం మంచిదే. కానీ తక్కువ మంది రైతులకు మేలు జరిగింది. ఈ విషయాన్ని కేంద్రం గుర్తించాలి. కొందరికి ఎక్కువ ధర లభించగా అందరు రైతులకు లాభం జరిగినట్లు కాదు. అనేక మంది రైతులు తక్కువ ధరకే విక్రయించారు. కేంద్రం మద్దతు ధర ప్రకటించి ఉంటే అందరికీ న్యాయం జరిగేది.

– గడ్డం లింగారెడ్డి, రైతు నాయకుడు, గుమ్మిర్యాల్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Printed at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) 08461 - 222645, 222646, 222647, Fax: 08461 - 222649. RNI Regn No. TELTEL/2008/23795.